

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

నేరస్థులు భయపడేలా.. ప్రజలు మెచ్చేలా పనిచేస్తాం

» ఎస్పీగా శివకిశోర్ బాధ్యతల స్వీకరణ

ఏలూరు క్రైం, జూలై 15 : నేరస్థులు భయపడేలా, ప్రజలు మెచ్చేలా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తానని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళా పోలీస్ సిబ్బందిని నియమించి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలు తెలుసుకుని సిబ్బంది వారితో మర్యాదపూర్వకంగా నడుచుకునేలా ఆదేశాలు ఇస్తాం. సిబ్బంది క్రమశిక్షణతోపాటు మెరుగైన ప్రజా సేవ అందించేలా చూస్తాం. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ డేలో స్వీకరించిన వినతులను కాల పరిమితిలోపు సత్వర పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటాం. గంజాయి, మద్యం, సారా అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడతాం. ప్రజలకు అవసరమైన సమయాల్లో పోలీసు సహకారాలు అందించడానికి టోల్ ఫ్రీ 112 లేదా ఎస్పీ వాట్సాప్ నెంబర్ 95503 51100కు 24 గంటల్లో ఎప్పుడైనా మెసేజ్ చేయవచ్చు. సత్వర చర్యలు తీసుకుంటాం. ఎంతో చరిత్ర కలిగిన ఏలూరు జిల్లాకు ఎస్పీగా రావడం ఎంతో ఆనందంగా ఉంది'.. అని పేర్కొన్నారు. తొలుత ఆయనకు ఆర్మ్‌డు రిజర్వు సిబ్బంది గౌరవ వందనం అందించారు. ఎస్పీకి ఏఎస్పీ స్వరూపరాణి, ఎస్‌ఈబీ ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ శ్రీహరి, డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ఆర్ఐ పవన్‌కుమార్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వైఎస్ ప్రెసిడెంట్ భావనకుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జిల్లా ట్రెజరర్ నాని, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.రమేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ రత్నకుమారి, కార్యవర్గ సభ్యులు వేణు, గోపీ పుష్పగుచ్ఛాలు అందించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్‌ను ఎస్పీ శివకిషోర్ మర్యాద పూర్వకంగా కలిశారు.



ఐజీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ శివకిశోర్

వైభవంగా జగన్నాథ రథయాత్ర





అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో సోమవారం ఏలూరులో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు జనసేనాని సత్కారం





కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో మంగళగిరి జనసేన కార్యాలయంలో సోమవారం పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమావేశం నిర్వహించారు. జిల్లాకు చెందిన ఉంగుటూరు, పోలవరం ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజును పవన్ సన్మానించారు.

వీరిద్దరికే ఎందుకిలా..?

ఒకే జిల్లాలో కలెక్టర్, ఎస్పీ ఇద్దరికీ నో పోస్టింగ్

» వెలుగు చూస్తున్న రకరకాల కారణాలు

» తొలిసారి ఒకే దఫాలో పనిచేసిన ఇద్దరికీ ఎదురుదెబ్బ

» జిల్లా అంతటా ఎడతెగని చర్చ

గడిచిన రెండు దశాబ్దాల కాలంలో ఐపీఎస్, ఐఏఎస్‌కు జిల్లా నుంచి జి.ఏ.డికి రిపోర్టు చేయాల్సిన దుస్థితి రాలేదు. కాని తొలిసారిగా ఏలూరు జిల్లాకు సంబంధించి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతిలను ప్రభుత్వం జి.ఏ.డి.కి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. వారి స్థానంలో కొత్త వారికి నియామక ఉత్తర్వులు ఇస్తూనే వారిద్దరిని పక్కన పెట్టింది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఈ పరిస్థితి ఇంతకు ముందు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎవ్వరికి రాలేదు.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

సాధారణంగా ఈ జిల్లాలో పనిచేసేందుకు ఎక్కువమంది ఆసక్తి ప్రదర్శిస్తారు. వివాద రహితంగా ఉండడం, ఘర్షణలు, రాజకీయ ప్రత్యర్థి వర్గాల దాడులు తక్కువగా ఉండడం వంటి నేపథ్యంలో అన్నింటిని పరిగణలోకి తీసుకుని ఆ మేరకు ఈ జిల్లాకు రావాలంటేనే అందరూ పోటీలు పడే వారు. కాని గడిచిన ఐదేళ్లలో జగన్ సర్కార్ హయాంలో అనేకమంది అధికారులు రకరకాల అభియోగాలు, ఆరోపణలు పనిచేసిన ప్రాంతంలో ఎదుర్కొవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఒత్తిడి చేయడంతో కొన్ని చక్కబెట్టాల్సి వచ్చింది. మరికొన్ని ఎవరు చెప్పినా చేయకపోయినా చేసుకుంటూ పోయారు. ఈ క్రమంలోనే జిల్లాల విభజన జరిగింది. కొత్తజిల్లాలో దాదాపు రెండేళ్లకు పైగా కలెక్టర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్‌ను అనూహ్యంగా బదిలీ చేసి ఆయన స్థానంలో వెట్రిసెల్విని నియమిస్తూనే ప్రసన్న వెంకటేష్‌ను జి.ఏ.డి.లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. అప్పట్లో ఆయన మరోజిల్లాకు కలెక్టర్‌గా నియామకం కానున్నారని, సీఎంవోలో నియమితులు కాబోతున్నారంటూ కొందరు ప్రచారం చేశారు. వీటికి భిన్నంగా ఆయనకు ఇప్పటివరకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ జిల్లాలో ఇంతకు ముందు పని చేసిన కలెక్టర్లు ఎవ్వరికి ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. కాని ప్రసన్న వెంకటేష్ కలెక్టర్‌గా ఇదే జిల్లాలో కొనసాగినన్నాళ్ళు పెద్దగా విమర్శలకు గురికాకపోయినా కొన్ని విషయాల్లో ఆయనపై బురద పడింది. ఎన్నికల సమయంలోనూ ఎటువంటి వివాదాలు లేకుండానే పూర్తి చేయగలిగారు. కాని అప్పట్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దలకు అలవోకగా కొన్ని పనులు చేయించారంటూ దుమారం చెలరేగింది. కాని గోదావరి వరదల సమయంలోనూ, ఇతరత్రా కొన్నింటిలో మెరుగైన సమర్థత ప్రదర్శించానని ఏలూరు జిల్లాలో సాఫీగా పాలనా వ్యవహారాలను చక్కపెట్టానని, తనపై బదిలీ వేటు పడినా మరో జిల్లాకు కలెక్టర్ హోదాలోనే వెళ్ళి తీరతాననే నమ్మకంతో అప్పట్లో ప్రసన్న వెంకటేష్ ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనూహ్యంగా తొలి జాబితాలోనే ఆయనను బదిలీ చేసి జి.ఏ.డి.కి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించడం అందరిని దిగ్ర్భాంతికి గురిచేసింది. తొలిసారి జిల్లా కలెక్టర్ హోదాలో ఇక్కడ పనిచేసి జి.ఏ.డి.కి రిపోర్టు చేయాల్సిన పరిస్థితిని వెంకటేష్ కొని తెచ్చుకున్నారా? లేక? మరేదైనా బలమైన కారణం ఉండే ఉంటుందంటూ ఇప్పటికి అధికార వర్గాల్లో చర్చ జరుగుతూనే ఉంది. ఇదే జిల్లాలో ఇంతకు ముందు కలెక్టర్లుగా పనిచేసిన రేవు ముత్యాలరాజు లాంటి ఐఏఎస్ అధికారులు, జగన్ హయాంలో సీఎంవోలో ప్రత్యేక స్థానం పొందారు. మరో సీనియర్ ఐఏఎస్ అధికారి కాటమనేని భాస్కర్ సైతం ఇదే జిల్లాలో నాలుగేళ్ల పాటు కలెక్టర్‌గా కొనసాగారు. ఇప్పుడు ఆయన సీఆర్‌డీఏ కమిషనర్‌గా నియమితులై ప్రాధాన్యత కలిగిన పోస్టులో నియమితులయ్యారు.



ప్రసన్న వెంకటేష్



మేరీ ప్రశాంతి

ఎస్పీ విషయంలోనూ అంతే?

జిల్లా ఎస్పీ మేరీప్రశాంతిని సైతం తాజాగా బదిలీ చేసి ఆమె స్థానంలో జిల్లా ఎస్పీగా ప్రతాప్ శివ కిషోర్‌ను నియమించారు. కాని మేరీప్రశాంతిని జి.ఏ.డిలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించడం పోలీస్ వర్గాల్లో పెద్ద చర్చే జరుగుతోంది. కేవలం స్వల్పకాలమే ఆమె ఇక్కడ ఎస్పీగా కొనసాగారు. ఈ కాలంలో ఆమె కొన్ని వివాదాస్పద నిర్ణయాలవైపు తొంగి చూశారా? లేక? ఆమెపై కొందరు పనికట్టుకుని ఫిర్యాదుల పరంపర నడిపారా? అనే దానిపైనే చర్చసాగు తూనే ఉంది. గతంలో ఉమ్మడి పశ్చిమలోనూ, ఏలూరు జిల్లాగా రూపాంతరం చెందినప్పుడు పనిచేసిన ఎస్పీలు ఎవ్వరికి ఈ పరిస్థితి రాలేదు. మేరీప్రశాంతి సర్దుకుపోయే గుణం ఉన్న ఐపీఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కాని కొన్ని విషయాలు వచ్చేసరికి వేగంగా స్పందించి నేరస్తులను అరెస్ట్ చేసేంత వరకు ప్రశాంతి నిద్రపోలేదు. అంతలా రాణించిన ఎస్పీని పోస్టింగ్ లేకుండా జి.ఏ.డికి పంపడమే ఇప్పుడు హాట్ టాపిక్. అయితే దీని వెనుక రకరకాల కారణాలు ఉన్నాయంటూ పోలీస్ వర్గాల్లో ఇప్పటికి చర్చ కొనసాగుతూనే ఉంది. ఇంతకు ముందు ఇక్కడ ఉమ్మడి పశ్చిమలోనూ, ఏలూరు జిల్లాలోనూ పనిచేసిన ఎస్పీలందరికి తిరిగి ప్రాధాన్యత క్రమంలోనే పోస్టింగ్‌లు లభించాయే తప్ప, ఈ పరిస్థితి ఎవ్వరికి ఎదురు కాలేదు.

1800-425-6025

» ఇసుక సరఫరాలో ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు : కలెక్టర్

ఏలూరు సిటీ, జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా, పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ కె.వెట్రి సెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 'గోదావరి పరీ వాహక ప్రాంతంలో ఇసుక డీ సిల్టింగ్ కోసం నీటిపారుదల శాఖ సీఈ నుంచి ఇసుక సాధ్య, అసాధ్యాల నివేదికలను అధికారులు పొందాలి. ఉచిత ఇసుక విధానాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసే దిశగా ఇసుక అక్రమ వెలికితీత, రవాణా చేసే చర్యలను నిరోధించేందుకు జిల్లాస్థాయి కంట్రోల్‌రూమ్‌ను మైన్స్ ఏడీ కార్యాలయంలో 1800-425-6025 టోల్ ఫ్రీ నంబర్‌తో ఏర్పాటు చేశాం. నిషేధిత ప్రాంతాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలి. సరైన రసీదు లేకుంటే ఇసుక రవాణా జరగకుండా చూడాలి. డివిజనల్ స్థాయిలోను కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలి'.. అని సూచించారు. జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎస్.సూర్యచంద్రరావు, ఆర్డీవోలు ఎన్ఎస్‌కే ఖాజావలి, వై.భవానీ శంకరి, కె.అద్దయ్య, మైనింగ్, రవాణా, ఇరిగేషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూలై 15 : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మరో రెండు రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. జిల్లాలో గడచిన 24 గంటల్లో అత్యధికంగా నూజివీడు మండలంలో 10.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 0.8 మి.మీ నమోదైంది. ఏలూరు రూరల్ 6, దెందులూరు 1.6, పోలవరం 1.2, ముదినేపల్లి 1, పెదవేగి, కుక్కునూరు, లింగపాలెం మండలాల్లో 0.8, బుట్టాయిగూడెం 0.6, పెదపాడు 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షాల కారణంగా సార్వా వరి సాగు జోరుగా సాగుతోంది.

పాపం పసివాళ్లు

» పసివాడి ప్రాణం తీసిన ఆవేశం
» రోడ్డు పక్కన శిశువు మృతదేహం 7

కలిసి పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి.. చిత్రంలో ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ

ప్రజా ప్రతినిధులు, అధికారులకు మంత్రి పార్థసారథి పిలుపు

» ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష

» సమావేశం దృష్టికి నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యలు : వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి, కలెక్టర్ వెల్లడి

ఏలూరు సిటీ, జూలై 15 : ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరం కలిసి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పిలుపునిచ్చారు. అధికారులతో వివిధ శాఖల వారీగా అమలు జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సమీక్షించారు. జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, ఆర్డీవోలు ఎన్ఎస్‌కే ఖాజావలి, కె.అద్దయ్య, వై భవానిశంకరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతుల రుణాలను పెంచాలి

» మంత్రి పార్థసారథి

వార్షిక రుణ ప్రణాళికలో రైతులకు పంట రుణాల లక్ష్యం రూ. 7,300 కోట్లు, కౌలు రైతులకు మాత్రం కేవలం రూ.250 కోట్లు కేటాయించారు. వ్యవసాయ ప్రధానమైన జిల్లాలో 75 శాతానికి పైగా సాగును కౌలు రైతులు చేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కౌలు రైతులకు అందించే పంట రుణాల లక్ష్యాన్ని రెండు వేల కోట్లకు పెంచాలి. భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా పంట రుణాలు అందించాలి. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందాలి. సాగు నీటి చెరువులు, కాల్వలు, డ్రైన్లలో తూడు తొలగించాలి. భారీ వర్షాలు, గాలులకు విద్యుత్ తీగలు తెగి ప్రమాదాలు జరుగుతు న్నాయి. వీటిని సరిచేయాలి. రోడ్ల మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకురావాలి. పేదల గృహ నిర్మాణ పథకంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించిన వారిపై చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేయాలి. చేపల చెరువులకు కోడి వ్యర్థాలను వినియోగిస్తున్న, వాటిని తరలిస్తున్న వారిపై న కేసులు నమోదు చేయాలి. ఎమ్మెల్యేలు తెలిపిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి.

ఎమ్మెల్యేలు తెలిపిన అంశాలపై చర్యలు

» కలెక్టర్ కె.వెట్రిసెల్వి

నియోజకవర్గాల వారీగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులతో సమీక్షించేందుకు సమావేశం ఏర్పాటు చేశాం. వివిధ శాఖలు చేపడుతున్న పనులను సంబంధిత ఎమ్మెల్యేలకు తెలియజేయాలి. సమావేశంలో వారు చెప్పిన అంశాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఇల్లు పూర్తి కాకుండానే బిల్లులు

» ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి)

ఏలూరు నగరంలో రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి. గతంలో పేదలకు ఇళ్ల పథకంలో నిర్మాణాలు పూర్తి కాకుండా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారు. దీనిపై విచారణ చేపట్టాలి. నగరంలో 34 వేల టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరైనా,ఇంకా పూర్తి కాలేదు. వాటిని నిర్మించి లబ్ధిదారులకు అందించాలి.

కోడి వ్యర్థాలపై నిఘా పెట్టాలి

» కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

చేపల చెరువుల్లో మత్స్య ఉత్పత్తులను పెంచేందుకు చాలా మంది కోడి వ్యర్థాలను వినియోగిస్తున్నారు. ఈ ఉత్పత్తులను వినియోగిస్తున్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. నీటి వనరులు కలుషితంతోపాటు పర్యావరణానికి పెను ప్రమాదం సంభవిస్తోంది. వీటి నియంత్రణపై నిఘా పెట్టి చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి.

చెరువులకు అనుమతులివ్వాలి

» ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

చేపల చెరువులకు కోడి వ్యర్థాల వినియోగాన్ని నియంత్రించాలి. ఆక్వా జోన్ పరిధిలోని చేపలు, రొయ్యల చెరువులకు అనుమతులు మంజూరు చేయాలి. సాగు నీటి చెరువులు, కాలువలు, డ్రైన్లలో తూడు తొలగించాలి. ఉంగుటూరు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు.

కుక్క కాట్లపై చర్యలు తీసుకోవాలి

» చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

రోడ్ల ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించటంపై అధికారులు ప్రజలకు అవగాహన కలిగించాలి. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా పందుల పెంపకాన్ని నియంత్రించాలి. ప్రజలు వీధి కుక్కల కాటుకు బలి కాకుండా చర్యలు తీసుకోవాలి. నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి.

జగనన్న కాలనీల్లో అక్రమాలు

» దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

జగనన్న కాలనీల భూసేకరణలో ఎన్నో అక్రమాలు జరిగాయి. వాటిపై పూర్తి వివరాలు వారంలోగా అందించాలి. పేదల ఇళ్ల స్థలాలు మెరక చేసేందుకు పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి మట్టిని తరలించినట్టు బిల్లులు చేసుకున్నారు. కానీ మట్టిని తమ్మిలేరు నుంచి తరలించారు. వీటిపై విచారణ చేయాలి. చేపల చెరువులకు కోడి వ్యర్థాల వినియోగం పెదపాడు మండలంలో పెద్దఎత్తున సాగుతోంది. వీటిపై చర్యలు తీసుకోవాలి.

రోడ్లు బాగు చేయాలి

» గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

ద్వారకా తిరుమలకు ఎంతో మంది భక్తులు కాలినడకన వస్తారు. కావున ముందు ఈ మండలంలో రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కల్కి భగవానునిగా జగన్నాథుడు



ద్వారకా తిరుమల జూలై 15: కల్కి భగవానునిగా జగన్నాథుడు సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా జగన్నాథుడు ఖడ్గాన్ని డాలును ధరించి కల్కి అవతారంలో సాక్షాత్కరించారు. ఈ నెల ఏడో తేదీన ప్రారంభమైన జగన్నాథుని ఉత్సవాలు మంగళవారం రథయాత్రతో ముగియనున్నాయి.

బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సత్య ఉషారాణి

తణుకు, జూలై 15 : ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల చిట్టూరి సుబ్బారావు, సత్య ఉషారాణి బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో నందు జరు గుతున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్-13 సింగిల్స్‌లో ఎస్.హేమంత్‌శ్రీ (విన్నర్), టి.కౌసిక్(రన్నర్), మెన్ 60 ప్లస్ సింగిల్స్ విభాగంలో ఎ.వంశీ కృష్ణంరాజు, ఆర్. పవన్‌కుమార్ (రన్నర్), ఉమెన్ 50 ప్లస్ డబుల్ విన్నర్ ఎస్. వేమన, యు.పవనిశ్రీ, మెన్ డబుల్స్ విన్నర్ ఆర్.సంజీవరావు, గునా శ్రీఖర్, అండర్ 11 విన్నర్స్ డబుల్స్ టి.కౌసిక్, బి.సూర్య, అండర్-15 విన్నర్ సింగిల్స్ ఎం.మనోజ్ఞ విజేతలుగా నిలిచారు.కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి లో విజేతలుగా నిలవాలని కోరారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు, కళాశాల సెక్రటరీ చిట్టూరి సత్య ఉషారాణి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సెక్రటరీ మెంటే వంశీకృష్ణ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంటిపూడి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.సతీష్, కోచ్ యు.సుదర్శన్, కళాశాల పీడీలు రత్నకుమారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్‌వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, జూలై 15: కర్నూలులో జరిగిన 9వ జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో ఏలూరు జిల్లా తరపున పాల్గొన్న స్విమ్మింగ్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించారు. సబ్ జూనియర్ విభాగం లో స్వామినాయుడు నాలుగు బంగారు పతకాలు, రజిత పతకం సాధించగా, జూనియర్ విభాగంలో బి.ధనుష్ రెండు బంగారు పతకాలు, వి.రఘురామ్ రెండు కాంస్య పతకాలు, సబ్ జూనియర్ విభాగంలో ఎండీ సిద్రా, మూడు వెండి, కాంస్య పతకం సాధించారు. సీహెచ్ పూర్వి వెండి పతకం, యశస్విని వెండి పతకం, టి.శ్రాగ్విత వెండి, బీఆర్‌ఆర్‌వీ భవానీ కార్తీక్ రజత పతకం సాధించారు. సోమవారం కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జేసి లావణ్యవేణిను వీరు మర్యాద పూర్వకంగా కలవడంతో వారిని అభినందించారు.

అంబేడ్కర్, పూలే చిత్ర పటాలు ఏర్పాటు చేయాలి

ఏలూరు రూరల్, జూలై 15 : రాష్ట్రంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డీపీవోను తొలిసారిగా కలిసిన నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేశారు. గోపాలరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన నెలలోపే 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.250 కోట్లు విడుదల చేయటం అభినందనీయ మన్నారు. ఐదేళ్లలో వివిధ పద్దుల కింద వైసీపీ ప్రభుత్వం బకాయిపడిన మిగతా నిధులను త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు ఆస్పత్రి సీజ్

వేలేరుపాడు, జూలై 15 : వేలేరుపాడులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ, ఇతర అధికారులు సోమవారం సీజ్ చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్ తెలిపిన వివరాలివి.. 2022 డిసెంబర్ 12న ఈ ఆస్పత్రిలో మహిళ మృతి చెందింది. దీనిపై ఆమె భర్త దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆస్పత్రిని సీజ్ చేశాం. అయినా వైద్యుడు కేసగాని శ్రీనివాస్‌గౌడ్ తిరిగి ఆస్పత్రిని ప్రారంభించి వైద్యం చేస్తున్నారు. దీనిపై దుర్గారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయండతో విచారణ జరపగా లైసెన్స్ రెన్యువల్ లేకుండానే ఆస్పత్రి నడుపుతున్నారని గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. డీఎంఓ నాగరత్నం, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిని ఆగజ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తాగు నీటికి 54 రకాల పరీక్షలు

పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్‌ఈ సుధాకర్

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మంచినీటిని 54 పరీక్షలు చేసి ప్రజలకు సరఫరా చేయాలని పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ ఎ.సుధాకర్ తెలిపారు. మునిసిపాలిటీలకు సోమవారం ప్రత్యేక సూచనలు చేశారు. మా సర్కిల్ పరిధిలో రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు కార్పొరేషన్లు, 18 మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంలో పైపు లైన్ల లీకుల వల్ల మంచి నీరు కలుషితమవుతుంది. మంచి నీటిని వ్యాధి కారక లక్షణాలు, ఇతర లోపాలు నిర్ధారించడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిండిగ్స్ (ఎస్‌వోపీ) గైడ్ లైన్స్‌ను ఈఎన్‌సీ జారీ చేసింది. వాటి ప్రకారం 54 రకాల పరీక్షలు చేయాలి. భూ గర్భ జలాలు, బోరు బావులు, చేతి పంపులు, ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో నెలకోసారి ఈ పరీక్షలు చేయాలి. కెమికల్ విభాగంలో 12 రకాల పరీక్షలు ఉంటాయి. బ్యాక్టీరియా కోలి టెస్ట్ వారానికొకసారి చేయాలి. హెవీ మెటీరియల్ విభాగంలో 21 రకాల పరీక్షలు చేయాలి. పెస్టిసైడ్స్ విభాగంలో 14 రకాల పరీక్షలు మూడు నెలలకోసారి చేయాలి. ఆర్గో క్లోరైడ్స్‌కు సంబంధించిన ఐదు పరీక్షలు ఉంటాయి. వాటిలో మిథైల్ పార్థాన్, మిలాథిన్, క్లోర్పిఫోస్, ఈథిన్, మోనోక్రోటోఫస్ వాటి పరీక్షలను మూడు నెలలకు ఒకసారి చేయాలి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జంగారెడ్డిగూడెం, జూలై 15 : పట్టణంలో తాళం వేసి ఉన్న ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న పులగం విజయ్ అయ్యప్ప టౌన్‌షిప్‌లో నివసిస్తున్నారు. విజయ్ కుమార్తె అనారోగ్యం తో ఉండడంతో ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళారు. అక్కడ పని ముగించుకుని సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని తన ఇంటికి వచ్చే సరికి ఇంటి ముఖ ద్వారం తాళం పగలగొట్టి ఉందని లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి లాకరులో ఉన్న బంగారు వస్తువులు, వెండి పట్టీలు, కొంత నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారని బాధితుడు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

లాభాల పంట రూప్‌చంద్



ఆక్వా రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. కూటమి ప్రభుత్వం రాకతో మార్కెట్లో చలనం కలిగి ఎన్నడూ లేని విధంగా జూలైలో అత్యధిక ధర పలకడం రైతులు ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. సాధారణంగా రూప్‌చంద్ మార్కెట్ జనవరి నుంచి మే వరకు అత్యధిక ధర పలుకుతుంది. జూన్, జూలై నెలలో సముద్రం చేపలు సమృద్ధిగా లభించడంతో ఈ కాలంలో రేటు తక్కువగా ఉంటుంది. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వ ఏర్పాటుతో రైతులకు లాభం చేకూరేలా ధర పెరగడం మంచి రోజులు వచ్చాయని అభిప్రాయపడుతున్నారు.

» చేపల మార్కెట్లు కళకళ » కేజీ ధర రూ.114 » ఆనందంలో రైతులు

నిడమర్రు జూలై 15: మార్కెట్‌లో అసాధారణంగా రూప్‌చంద్ రేటు, అటు శీలావతి రేట్లు పెరగడంతో చేపల మార్కెట్లు కళకళలాడుతున్నాయి. సాధరణంగా కేజీ రూపచంద్ తయారీకి రైతుకు అన్నీ కలిపి రూ.90 నుంచి రూ.95 వరకు ఖర్చవుతుంది. నేడు మార్కెట్‌లో ధర పెరగడంతో కేజీ చేప ధర రూ.114 పలకడంతో రూ.15 నుంచి రూ.20లు రైతుకు గిట్టుబాటు అవుతుంది.

గత ప్రభుత్వ హయాంలో అంతా నష్టమే

గత వైసీపీ హయాంలో ప్రభుత్వ విధానాల కారణంగా చేపల మేత ధరలు అమాంతం పెరిగాయి. ఓ పక్క అధిక విద్యుత్ ధరల భారం ఇతర ఖర్చులు పెరిగిపోవడంతోపాటు మార్కెట్ ట్రేడర్ చేపల ధరలు తగ్గించి కొనుగోలు చేసేవారు. కంపెనీల తరుపున అనధికారికంగా అప్పటి అధికార పార్టీ పెద్దలకు మామూళ్లు సమర్పించాల్సి రావడంతో మార్కెట్ రేటు బాగున్నా రైతుకు గిట్టుబాటు ధరను ట్రేడర్స్ ఇవ్వలేకపోయేవారు. నేడు కూటమి ప్రభుత్వం రాకతో మామూళ్ల బెడద తొలగిపోవడం, ట్రేడర్స్ స్వేచ్ఛగా వ్యాపారాలు చేస్తుండడంతో రైతుకు మార్కెట్ ధరనే ఇస్తున్నారు. దీంతో రైతుకు అధిక ధర రావడంతో లాభాల బాట పట్టారు.

తగ్గిన రూప్‌చంద్ సాగు

గత ప్రభుత్వ విధానాల వల్ల రూప్‌చంద్ సాగు పూర్తిగా తగ్గిపోయింది. పది ఎకరాలకన్నా ఎక్కువ ఉన్న చెరువులకు ఆక్వా విద్యుత్ సబ్సిడీ లేకపోవడంతో బిల్లులు వేలాది రూపాయలు రావడంతో రైతులు బెంబేలెత్తి తమ చెరువులను చిన్న చెరువులుగా చేసి రొయ్యల సాగు చేయడం ప్రారంభించారు. కానీ రొయ్యల సాగు కూడా తీవ్ర నష్టాలు రావడంతో ముందుకు సాగలేక చతికిల పడ్డారు. దీంతో రూప్‌చంద్ చెరువుల సాగు పూర్తిగా తగ్గిపోయింది. దీనికి తోడు చేప ధర కూడా లేకపోవడంతో చెరువుల సాగు తగ్గించేశారు. చాలామంది తమ చెరువులను అయిన కాడికి లీజులకిచ్చి చేతులు దులుపుకొన్నారు. నేడు ప్రభుత్వ విధానాలు మారడం, తదనంతరం చేపల ధరలు పెరగడంతో మళ్లీ పాత రోజులు వచ్చాయని ఆశపడుతున్నారు. ఆక్వాకు పూర్వ వైభవం వస్తోందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సాగు ఇలా..

- చేపల సాగు చెరువులు : సుమారు లక్షన్నర ఎకరాలు
- రొయ్యల సాగు చెరువులు : సుమారు 2.25 లక్షల ఎకరాలు

మార్కెట్‌లో నిలకడ వచ్చింది



గత ప్రభుత్వ హయాంలో కొన్ని విధాన పర లోపాల వల్ల ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతింది. చేపల సాగు చేసిన రైతులు కూడా నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. కానీ నేడు నూతన ప్రభుత్వంలో మార్కెట్‌లో నిలకడ వచ్చి చేపల రేట్లు ఎన్నడూ లేనంతవిధంగా పెరగడంతో రైతు లాభాల బాట పట్టాడు. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు అన్ని రకాలు ఉంటుందని ఆశతో ఉన్నాం.

- పొత్తూరి కృష్ణం రాజు, ఆక్వారైతు, ఫత్తేపురం

ఆనందంగా ఉంది



నేను ఆక్వా సాగు చేసినప్పటి నుంచి ఎన్నడూ జూలైలో ఈ రేటు చూడలేదు. రూప్‌చంద్ కు మే నెలలో పలికే ధర జూలైలో రావడం ఆనందంగా ఉంది. రైతు పది టన్నులకు సుమారు రూ.లక్ష పైనే లాభం వస్తుంది. చికితిపోయిన ఆక్వా రంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోని అండగా ఉంటుదని ఆశగా ఉన్నాం. చేపల సాగు లాభాల బాట పట్టడం శుభసూచకం.

- పైడికొండల శివాజి, ఆక్వా రైతు, అడవికొలను

అమ్మో పాము



1917 జూలై 16న జింబాబ్వే దేశంలో మొదటిసారిగా పామును గుర్తించారు. 1929లో పాము విష పూరితమైనదని గుర్తించారు. అప్పటి నుంచి ఏటా ఇదే రోజున పాముల దినోత్సవం జరుపుకుంటూ ప్రజలకు పాములపై అవగాహన కల్పిస్తుంటారు.

» ఉమ్మడి జిల్లాలో ఎనిమిది విషపూరిత జాతులు
» గతేడాది 300 పాము కాట్లు.. 80 మంది మృత్యువాత
» బాధితుల్లో ఎక్కువ మంది రైతులే.. నేడు ప్రపంచ పాముల దినోత్సవం

జంగారెడ్డిగూడెం, జూలై 15 : పాము.. ఈ పేరు వినగానే చాలా మంది భయపడతారు. నేరుగా చూస్తే అమ్మో అంటారు. అదే మన పక్క నుంచి వెళితే ఇంకేమైనా వుందా ? గుండెలు గుభేల్‌మంటాయి. సాధారణంగా పామును చూసి మనం ఎంత అలా భయపడతామో, అవి కూడా మనుషులను చూసి అంతే భయపడతాయి. అలా భయపడి కంగారులో వాటిని రక్షించుకునే క్రమంలో కాటు వేస్తుంది తప్ప పగపడుతుందనడంలో నిజం లేదు. పాములు పర్యావరణ పరిరక్షణలోను, పంటలను రక్షించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. సమస్త జీవ రాశులలోను ఇవి కూడా ఒక భాగమే. నిజానికి మానవ జాతికి పాములు చేసే హానికంటే మేలే ఎక్కువ. పంట పొలాల్లో ఎలుకలు చేసే పంట నష్టం అంతా ఇంతా కాదు. ఈ నష్టం నుంచి పాములు రైతుకు ఎంతో ఉపయోగపడతాయి. కలుగుల్లో దాగివున్న ఎలుకలను పాములు ఆహారంగా స్వీకరిస్తాయి. అలాగే పాము విషయం ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు మందులను తయారు చేస్తున్నారు. ఆ విధంగా మనుషులకు పాములు ఉపయోగపడుతున్నాయి. ప్రపంచంలో 3,789 జాతులున్నాయి. దేశంలో 740 పాము జాతులు వుండగా వీటిలో అత్యంత ప్రమాదకరమైన, విషపూరితమైనవి 72 మాత్రమే. అదే ఉమ్మడి జిల్లాలో ఎనిమిది విషపూరితమైన పాములున్నాయి. వీటిలో నాలుగు పాములు షావ్



కిల్డ్ వైపర్, బేంబో పిట్ వైపర్, కింగ్ కోబ్రా, మల బార్ పిట్ వైపర్ అటవీ ప్రాంతాల్లో మాత్రమే ఉంటాయి. రక్త పింజర, తాచు పాము, పొడ పాము, కట్ల పాము మనుషుల మధ్య సంచరిస్తాయి. వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

300 పాము కాట్లు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏటా మూడు వందలకుపైగా పాము కాటు కేసులు నమోదవుతున్నాయి. వీటిలో సుమారు 80 మంది వరకు మృత్యువాత పడుతున్నారు. వీరిలో రైతులే ఎక్కువగా ఉంటున్నారు. వర్షాకాలంలో అధిక పాము కాటు కేసులు నమోదవుతాయి కాబట్టి రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట తప్పనిసరిగా టార్చిలైట్ తీసుకువెళ్ళాలి. కాళ్ళకు బూట్లు ధరించాలి. ప్రమాదవశాత్తు పాము కాటుకు గురైతే ఆందోళనకు గురికాకుండా త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్ళాలి. యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) వేయించుకోవాలి. ఇలా చేయడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇది అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో వుంది.

పాములపై అవగాహన కలిగించాను

పాములను చంపకుండా వాటి నుంచి మనలను మనం ఎలా రక్షించుకోవాలో 500 గ్రామాలు తిరిగి యాభై వేలకు పైగా ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కలించాను. 2016లో స్నేక్ సేవియర్ సొసైటీ స్థాపించి ఇప్పటి వరకూ 19 వేల పాములను పట్టి అడవిలో విడిచిపెట్టాను. పాము జాతులు అంతరించకుండా నిరంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉం టాను. ప్రమాదవ శాత్తు పాము కాటు వేస్తే కాటు కు గురైన వ్యక్తి భయపడకుండా ఉండాలి. నడవ డం గానీ, పరుగెత్తడం గానీ చేయకూడదు. ఒత్తిడి కి గురి కాకుండా సకాలంలో ఆసుపత్రికి తీసుకుని వెళ్లిన వెంటనే యాంటీ వీనమ్ వ్యాక్సిన్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడ వచ్చు.

- చదలవాడ క్రాంతికుమార్, స్నేక్ సేవియర్ సొసైటీ వ్యవస్థాపకుడు

నిలిచిన పర్యాటక బోట్లు



పోలవరం జూలై 15 : పాపికొండల పర్యటన బోట్ల రాకపోకలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ఏపీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గంగబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ పరిస్థితులు వర్షాభావంగా ఉండడం, గోదావరి వరద ఉధృతి పెరగడం వల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టూరిజం బోట్ల రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా అధికారుల ఆదేశానుసారం వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత బోట్ల రాకపోకలు పునరుద్ధరించడం జరుగుతుందన్నారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరంలో గోదావరి నీటి మట్టం సోమవారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదుల నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో నీటి మట్టం రెండు రోజులుగా పెరుగుతోంది. స్పిల్ వేలోకి వస్తున్న జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడంతో ఇక్కడ సాధారణ నీటి మట్టం నమోదైంది. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.100 మీటర్లు, స్పిల్వే దిగువన 17.200 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.200 మీటర్లు, దిగువన 16.300 మీటర్లు నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

5,310 క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5,310 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటి మట్టం 15.777 మీటర్లకు చేరుకుం దని, 15 మోటార్లతో 15 పంపుల నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 5.7469 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం

పాలకోడేరు, జూలై 15: తల్లీ బిడ్డలు ఆరోగ్యంపై వైద్య సిబ్బంది జాగ్రత్త తీసుకోవాలని జిల్లా గణాధికారి సబరేశ్వరప్రసాద్, డీపీహెచ్‌ఎన్‌ఓ వెంకట రత్నం తెలిపారు. పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని గొరగనమూడి ఉప ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య శాఖాధికారులు సోమవారం వారు తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీలోని జనన మరణ రిజిస్టార్లు తనిఖీ చేశారు. ఎల్‌డీ కంప్యూటర్ భాస్కరరావు, డాక్టర్ లీలాలక్ష్మి, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, నాగమణి, గొరగనమూడి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

భీమవరం క్రైం, జూలై 15 : భీమవరంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న యువకుడు బైక్ అదుపు తప్పడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంప గ్రామానికి చెందిన ఇంటి సత్యసూర్యప్రకాష్(27) 14వ తేదీ రాత్రి భీమవరంలో పని ముగించుకుని ఇంటికి వెళుతూ బేతపూడి పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లే సరికి బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ముత్యాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ హెచ్‌సీ మహేష్ తెలిపారు.

పెట్రోలు లీకై బైక్ దగ్ధం



జంగారెడ్డిగూడెం, జూలై 15 : జల్లేరు వద్ద తల్లాడ-దేవర పల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా అతని ద్వి చక్ర వాహనంలోని పెట్రోలు లీకై పూర్తిగా దగ్ధమైంది. ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం మండలం చింతగొమ్మికి చెందిన కుంజా వీరా స్వామి తన ద్విచక్ర వాహనంపై జంగారెడ్డి గూడెం వైపుగా వస్తున్నాడు. జల్లేరు వద్దకు వచ్చే సరికి జంగారెడ్డి గూడెం నుంచి అశ్వారావుపేట వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం వీరాస్వామి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వీరాస్వామి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో 108 లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. జంగారెడ్డిగూడెం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మొగల్తూరు/నరసాపురం రూరల్, జూలై 15 : పేరుపాలెం బీచ్‌లో ఆదివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైందని ఏఎస్‌ఐ రాజేందర్ సోమవారం తెలిపారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన పాటి పురుషోత్తం(19) స్నేహితులు మొల్లేటి దుర్గాప్రసాద్, గుంటూరి హరిప్రసాద్, మొల్లేటి మున్నా, గుబ్బల బాబి, గుబ్బల విజయ్‌తో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చి సరదాగా గడిపి, సముద్ర స్నానం చేస్తుండగా అలల ఉధృతికి పురుషోత్తం గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు తీరంలో గాలింపు చర్యలు చేపట్టగా నరసాపురం మండలం పీఎం లంక వద్ద మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. కుటుంబ సభ్యులు పురుషోత్తంగా గుర్తించడంతో మృతుని స్నేహితులు మొల్లేటి దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రాజేందర్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల్ని ఎమ్మెల్యే నాయకర్, ఇంచార్జి పొత్తూరి రామరాజు పరామర్శించి సంతాపం తెలిపారు.

ప్రేమ విఫలం.. యువకుడి ఆత్మహత్య



ఎం.రవితేజ(ఫైల్)

యలమంచిలి, జులై 15: ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెంది మొగల్తూరు గ్రామానికి చెందిన మేడిచర్ల రవితేజ(22) చించినాడ బ్రిడ్జి వద్ద గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. రవితేజ కొన్ని రోజులుగా ఆచంటలో అతని మేనమామ ఇంటి వద్ద ఉంటున్నాడు. మేనమామకు శనివారం నరసాపురం వెళుతున్నానని చెప్పాడు. రవితేజ నరసాపురంలోని స్నేహితులను కలిసి మద్యం సేవించి సెల్ వారి వద్ద వదలి వెళ్లిపోయాడు. అయితే మేనమామ ఇంటి వద్ద ఉన్నాడని తల్లిదండ్రులు, ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని మేనమామ కుటుంబ సభ్యులు భావించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చించినాడ బ్రిడ్జిపై బైక్ ఉండటం, అక్కడ ఎవరూ లేకపోవడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బైక్ వివరాల ఆధారంగా రవితేజ తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు అతని సెల్‌కు ఫోన్ చేయగా, ఫోన్ తమ వద్ద వదిలేసి వెళ్లాడని స్నేహితులు చెప్పారు. బ్రిడ్జిపై ఉన్న బైక్ రవితేజదిగా అతని కుటుంబ సభ్యులు నిర్ధారించడంతో అతని ఆచూకీ కోసం పోలీసులు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం రవితేజ మృతదేహం గోదావరిలో లభ్యమైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో గొడవలు.. మహిళ ఆత్మహత్య



వద్ది భవాని (ఫైల్)

భీమవరం క్రైం, జూలై 15 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. రామాయణం సుబ్బన్నతోటకు చెందిన చిలుకోటి వెంకటరమణ నాలుగో కుమార్తె వద్ది భవాని (30)ను నాలుగేళ్ల క్రితం వద్ది శ్రీనుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి రెండేళ్ల పాప కూడా ఉంది. అయితే భవాని సచివాలయ పోలీస్‌గా 14వ వార్డులో పనిచేస్తోంది. భవాని భర్త శ్రీను మేనత్తకు ఆపరేషన్ చేయడంతో చూడటానికి వెళ్లాడు. దీంతో భవానికి ఆమె భర్త శ్రీనుకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ నెల 14న శ్రీను చర్చికి వెళ్లి వచ్చిన అనంతరం మరలా ఇద్దరి మధ్య తగాదాలు జరగడంతో భవాని తండ్రి వెంకటరమణ ఇద్దరిని మందలించి భవాని కుమార్తెను తనతోపాటు తీసుకువెళ్లగా, శ్రీను బయటకు వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో శ్రీను ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయకపోవడంతో కిటికీ లోంచి చూసేసరికి భవాని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే స్థానికులు, బంధువుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టగా అప్పటికే భవాని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహానికి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాపం పసివాళ్లు

పసివాడి ప్రాణం తీసిన ఆవేశం

చింతలపూడి, జూలై 15:లింగపాలెం మండలం పాశ్వానగరంలో సోమవారం ఒక కుటుంబంలో జరిగిన గొడవ పసివాడి ప్రాణాలు తీసింది. చింతలపూడి సీఐ సుధాకర్ తెలిపిన వివరాలివి.. జార్ఖండ్‌లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న చల్లపాటి బాలాజీ తన భార్యతో విడాకుల కేసులో కోర్టు వాయిదాకు వచ్చారు. పనిచూసుకుని వెళుతూ బాలాజీ భార్యను, మామను కొట్టడంతో వారు గాయాలపాలయ్యారు. వారు చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి వెళ్లారు. బాలాజీ అక్కడ నుంచి పాశ్వానగరంలోని మామ ఇంటికి వచ్చి అక్కడ ఉన్న ఇద్దరు మరదళ్లను, అత్తను కర్రతో తీవ్రంగా కొడుతుండగా, కర్ర అక్కడే ఉన్న మరదలి 36 రోజుల కొడుక్కి తగలడంతో ఆ బాలుడు మరణించాడని సీఐ తెలిపారు. విషయం తెలిసిన గ్రామస్తులు బాలాజీకి దేహశుద్ధి చేశారని, అతని చికిత్స నిమిత్తం ఏలూరు తరలించగా, పసికందును పోస్టుమార్టంకు చింతలపూడి తరలించామన్నారు. ధర్మాజిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

రోడ్డు పక్కన శిశువు మృతదేహం

జంగారెడ్డిగూడెం, జూలై 15: పట్టణంలో సోమవారం అమానవీయ సంఘటన జరిగింది. ఏరియా ఆస్పత్రికి కూత వేటు దూరంలో నిండా నెలలు నిండని మగ శిశువు మృతదేహాన్ని రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు పారవేశారు. ఉదయం పారిశుధ్య కార్మికుడు రేలంగి వెంకటేశ్వరరావు తన పనిలో భాగంగా అటు వెళ్లగా శిశువు మృతదేహాన్ని చూశాడు. విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లగా వీఆర్వో సవలం శ్రీరాములు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శిశువు మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం స్థానిక శ్మశాన వాటికలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఖననం చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ద్వారకా తిరుమల, జూలై 15: అదనపు కట్నం కోసం ఓ వివాహితను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్న భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. రామసింగవరంనకు చెందిన బూర్ల అనూషకు తాడేపల్లిగూడెం మండలం కూనవరంనకు చెందిన బూర్ల శ్రీనుతో ఎనిమిదేళ్ల క్రితం వివాహంకాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా చెడు వ్యసనాలకు బానిసైన శ్రీను భార్య అనూషను హింసిస్తున్నాడు. దీనిని శ్రీను తల్లిదండ్రులు, సోదరుడు ప్రోత్సహిస్తున్నట్లు అనూష కేసు పెట్టడంతో బూర్ల శ్రీను, నాగేశ్వరరావు, సూరమ్మ, సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని బాధితురాలి ఆందోళన

దండేపల్లి, జూలై 15: అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తూ భర్తను తన నుంచి వీడదీస్తున్నారని ఓ యువతి సోమవారం మండల కేంద్రంలోని ఆడపడుచు ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరంనకు చెందిన సౌజన్య తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొండాపూర్‌కి చెందిన ఇప్ప ప్రవీణ్ కుమార్‌తో 2013లో ప్రేమ పెళ్లి చేసుకుంది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు. తన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని, అందుకు ఆడపడుచు మౌనికే కారణమని ఆమె ఇంటి ఎదుట బాధితురాలు సౌజన్య కుమారుడితో న్యాయం చేయాలని ఫ్లెక్సీతో ఆందోళనకు దిగింది. ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌ను వివరణ కోరగా 2023లో ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. రెండు చోట్ల కేసులు నమోదు చేయలేమని, బాధితురాలితో మాట్లాడి నచ్చజెపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమెకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

భోజన కార్మికులపై వేధింపులు, తొలగింపులు తగదు

ఏలూరు రూరల్, జూలై 15: మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు, తొలగింపులు అరికట్టాలని కోరుతూ ఏపీ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ నామమాత్రపు వేతనాలతో పనిచేస్తూ బిల్లులు సకాలంలో రాకపోయినా సొంత పెట్టుబడితో పిల్లలకు వండి పెడుతున్నారన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొన్ని ప్రాంతాల్లో కార్మికులను మా ప్రభుత్వం వచ్చింది, నచ్చినవారిని పెట్టుకుంటామని వేధిస్తున్నారని, తక్షణం వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రకళ, అంకమ్మ, అనురాధ, అనసూర్య, కొండలరావు, అశోక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐవో తీరుపై పీడీఎస్‌యూ నిరసన

ఏలూరు రూరల్, జూలై 15: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న ఆర్‌ఐవోపై విచారణ జరపాలని పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్ వెట్రిసెల్విని కలసి ఫిర్యాదు చేశారు. తాడేపల్లిగూడెం ప్రైవేటు జూనియర్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతి విద్యార్థికి రూ.200 కట్టించుకున్నారని, పాసైన విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు కూడా అమ్ముతున్నారని, ఆర్‌ఐవోకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. తక్షణం కళాశాల యాజమాన్యం, ఆర్‌ఐవోపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

బుట్టాయగూడెం, జూలై 15: ఎస్టీ బాలుర, బాలికల కళాశాల వసతిగృహాలకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ జూనియర్ కాలేజి విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం మాట్లాడుతూ వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఎస్టీ కాలేజి వసతిగృహ భవనం కూలుతుందని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ రోజులు గడుపుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని వసతిగృహాలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని బన్నె వినోద్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు భోజనశాల లేదని, సుమారు 350 విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు లేవని తెలిపారు. డ్రైనేజి లేకపోవడంతో ప్రహరీ గోడపక్కనే నీరు నిలిచి దుర్గంధం వస్తుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులు అందజేసిన వినతిపై స్పందించిన తహసీల్దార్ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలను పరిష్కారించడం జరుగుతుందన్నారు. ఎం.సిద్ధు, కె.ఐశ్వర్య, ఎన్.గాయత్రి, బి.దీక్షిత, బి.కార్తీక్, పి.దుర్గాప్రసాద్, కె.నరేంద్ర, చోడెం నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్ సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘ నేత

బుట్టాయగూడెం, జూలై 15: మండలంలోని విప్పలపాడు ఏకలవ్య మోడల్ స్కూల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ స్కూల్ సమస్యలపై సర్వే చేసినట్లు గిరిజన సంఘం నాయకుడు తెల్లం రామకృష్ణ సోమవారం తెలిపారు. 390 మంది విద్యార్థులున్న స్కూల్‌లో 8 మంది వర్కర్లు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. తగినంత వంట సామగ్రి కూడా లేదని భోజన ఏర్పాట్లలో ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. స్కూల్లోని సిబ్బంది మొత్తం ఇతర రాష్ట్రాల వారు కావడంతో భాషా సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులను చిరువ్యాధులు ఇబ్బందులు పెడుతున్నాయని వైద్యశిబిరం ఏర్పాటుచేసి చికిత్స అందించాలన్నారు. ప్రతినెల వైద్యాధికారి స్కూల్ పర్యటన చేసి మెడికల్ క్యాంపుల ద్వారా వైద్య సేవలందించాలని కోరారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో లెనిన్, వినోద్, మంగరాజు ఉన్నారు.

గుండుగొలనులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

భీమడోలు, జూలై 15: గుండుగొలనులో తాగునీరు, డ్రైయినేజీ రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జనసేన నాయకుడు వగ్వాల విజయ్ వెంకట భాస్కర్ డీపీవోకు ఫిర్యాదు చేశారు. గుండుగొలనులో తాగునీటి చెరువులు ఉన్నప్పటికీ ఫిల్టర్ బెడ్‌లు రిపేరు చేయడం లేదని, దీంతో బోరు నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారని ఆయన అన్నారు. గుండుగొలనుతోపాటు భోగాపురంలోని చెరువుకు కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యలపై స్పందించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి



మాట్లాడుతున్న పీడీఎస్‌వో కార్యదర్శి మోహన్

ఏలూరు రూరల్, జూలై 15: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. రాష్ట్రకమిటీ ప్రచురించిన అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి స్టూడెంట్ ప్రత్యేక సంచికను ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. నవ యువ సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎస్.కె భాష మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజన ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాన్ని నడిపారన్నారు. ఆయన చనిపోయి వందేళ్లయినా ఆశయాలు సజీవం అన్నారు. పీడీఎస్‌వో రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, సాగర్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

ఏలూరు రూరల్, జూలై 15: విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సిస్టర్ సుశీల అన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవంలో పీజీ డైరెక్టర్ సిస్టర్ సుశీల ప్రసంగించారు. యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. చరిత్ర అధ్యాపకురాలు కల్యాణి మాట్లాడుతూ సవాళ్లను ఎదుర్కొనే శక్తి పెంపొందించుకోవాలన్నారు. అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు జగదీశ్వరి, హారిక, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు

వేలేరుపాడు, జూలై 15: జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వాలు ఈ నెల 18 నుంచి 28 నమోదు చేయించాలని అధినేత పవన్ కల్యాణ్ సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అవగాహన కల్పించారు. జనసేన మండల అధ్యక్షుడు ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. పార్టీ సభ్యత్వాలను గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో నమోదు చేయించాలని, మార్గదర్శకాలు జనసేన వలంటీర్ల ద్వారా తెలియజేస్తామన్నారు. జనసైనికుల కుటుంబాలకు భరోసా కల్పించేవిధంగా ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష ఇచ్చి అండగా ఉండటమే ముఖ్య ఉద్దేశమన్నారు. సంజయ్, క్రాంతికుమార్, దేవిరెడ్డి సుధాకర్, మోహన్, శివరామ్, వంశీ, వీరాస్వామి, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథ రథయాత్రలో కీర్తనల బృందం



నగరంలో వైభవంగా సాగిన జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా బాలికల కోలాట ప్రదర్శన

వైభవంగా జగన్నాథ రథయాత్ర

ఏలూరు కార్పొరేషన్, జూలై 15: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సోమవారం నగరంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ రథయాత్ర శనివారపుపేట లునాని పార్కు, ఇస్కాన్ మందిరం వద్ద ఎమ్మెల్యే బడేటి చంటి శంఖం ఊది ప్రారంభించారు. ఫైర్‌స్టేషన్ మీదుగా రామచంద్రరావుపేట మెయిన్ రోడ్డు, వన్‌టౌన్ మెయిన్‌బజార్ నుంచి రామకోటి వరకు కొనసాగింది. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలందరూ ఐకమత్యంగా జీవిస్తూ భక్తిభావాలను పెంపొందించుకోవాలని చెప్పారు. జగన్నాధుని రథయాత్రతో నగర ప్రజలందరికీ శుభం జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు రాధావల్లభదాస్, మాజీ మంత్రి మరడాని రంగారావు, టీడీపీ నాయకులు ఎంబీఎస్. శర్మ, ఇసుకపల్లి తాతారావు, డాక్టర్ వీవీ.బాలకృష్ణారావు, పుప్పాల శ్రీనివాస్, టీడీపీ మహిళా నాయకురాలు కడియాల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న కలెక్టర్ వెట్రిసెల్వి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పెదపాడు ఎంపీడీవో కార్యాలయ అధికారులు

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ఏలూరు రూరల్, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీదారుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి సోమవారం అర్జీలు స్వీకరించారు. అర్జీలు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని, ఒకసారి అందిన అర్జీ తిరిగి రెండోసారి రాకుండా పరిష్కార క్రియ ఉండాలన్నారు. సర్వే తదితర అంశాలతో ఫిర్యాదు అందిన మరుసటిరోజే విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌తో పాటు జేసీ బి.లావణ్యవేణి, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, ఆర్డీవో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి అర్జీలు స్వీకరించారు.

● వయోవృద్ధుల సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డబ్బులకోసం తన కుమారుడు కేసులు పెడుతూ హింసిస్తున్నాడని, రక్షణ కల్పించి భృతి ఇప్పించాలని ఏలూరు పత్తేబాదకు చెందిన వెంకట సత్యనారాయణ కలెక్టర్‌ను కోరాడు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను, కలెక్టర్ ఆదేశించారు.

● ఫిట్స్, నడవలేని, మాట్లాడలేని పరిస్థితిలో ఉన్న తమ కుమారుడు పూర్తి వీల్‌చైర్‌పైనే జీవించాల్సి వస్తుందని, రూ.15వేలు పెన్షన్ మంజూరు చేయాలని పెదవేగి మండలానికి చెందిన కొల్లి మణికుమార్ అర్జీ అందజేశారు. టి.నరసాపురం సొసైటీలో రూ.18లక్షలు డిపాజిట్ చేశామని, కాల పరిమితి పూర్తయినా నగదు ఇవ్వడంలేదని టి.నరసాపురానికి చెందిన ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. తమ ఇల్లు అగ్నిప్రమాదానికి గురైందని, ఇల్లు మంజూరు చేయాలని పోలవరానికి చెందిన సీహెచ్.వీరరాజు ఫిర్యాదు చేశారు.

వైసీపీ నాయకుల వేధింపులు

తమ భూమిలో రాకపోకలకు పుంతదారిని కొంతమంది వైసీపీ నాయకులు ఆక్రమించారని, తాము వెళ్ళకుండా దాడులు చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని టినరసాపురం మండలం సాయంపాలెం గ్రామానికి చెందిన నులకాని సుబ్బాయమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెండున్నరేళ్లుగా వైసీపీ నాయకుల అండదండలతో న్యాయం జరగలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

పెదపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఆర్జీపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు అర్జీలను స్వీకరించారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని, ఇంకా పరిష్కారం కాని సమస్యలను ఆర్జీ ద్వారా అందిస్తే విచారణ జరిపి తగు న్యాయం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు భావన్నారాయణ, ఈవోపీఆర్డీ సూర్యకుమార్, సచివాలయ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

పెదవేగి, జూలై 15: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సహాయ మలేరియా అధికారి జే.గోవిందరావు తెలిపారు. వర్షాకాలం దోమల కారణంగా మలేరియా, డెంగీ వ్యాప్తి చెందుతాయని ఆయన చెప్పారు. గార్లమడుగు పంచాయతీ వెంకటకృష్ణాపురంలో సోమవారం మలేరియా అవగాహనా ప్రదర్శన నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు పూర్ణిమ, మాధవి, సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు. వారంలో ఒకరోజు ఇంట్లో వాడే నీటి తొట్టెలు, నీరు నిల్వ ఉంచే ఇతర వస్తువులను శుభ్రపర్చుకోవాలని సూచించారు. సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంటుల్లు మేకా శ్రీనివాసరావు, రమేష్‌బాబు, ప్రసాద్, విజయవర్ధన్, సంపత్, ఏఎన్ఎంలు మంగ, మౌనిక, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన

కొయ్యలగూడెం, జూలై 15: అతిసార నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బయ్యన్నగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం సూచించారు. గంగవరం, రాజవరం గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పంచాయతీ అధికారులు కూడా వాటర్‌ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. సూపర్‌వైజర్ ఎస్కే చాన్‌బాషా, సంధ్యా, శ్రీలక్ష్మి, ఏఎన్ఎంలు కృష్ణకుమారి, వెంకటకుమారి, సుజాత, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుదారుల చట్టంపై ప్రచార ఉద్యమం



తహసీల్దారుకు కరపత్రం ఇస్తున్న ఝాన్సీరాణి

పెదపాడు, జూలై 15 : పంట సాగుదారుల చట్టంపై దళిత గిరిజన బడ్జెట్ వాచ్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో ప్రచారోద్యమం సోమవారం ప్రారంభించారు. డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ గోసాల ఝాన్సీరాణి ఆధ్వర్యంలో తహసీల్దారు భావన్నారాయణకు కరపత్రం అందజేశారు. రైతుకు, కౌలురైతుకు మధ్య అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని సత్వరం పరిష్కరించాలన్నారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. డీబీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలకు రాయబారం

ఏలూరు కార్పొరేషన్, జూలై 15: వ్యవసాయ కార్మిక రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 18, 19 తేదీల్లో గ్రామ సచివాలయాలకు సామూహిక రాయబారం నిర్వహిస్తున్నట్టు పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ తెలిపారు. అన్నే భవనంలో సోమవారం జరిగిన రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు సమస్యలపై సామూహిక రాయబారాలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థులను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలి

పెదపాడు, జూలై 15: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని ఎంఈవో 1 ఎస్.నరసింహమూర్తి అన్నారు. గండిచెరువుగట్టు పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

మంత్రి కొలుసు పార్థసారథి

ఏలూరు సిటీ, జూలై 15: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం అనంతరం సోమవారం పాత్రికేయులతో మాట్లాడారు. ప్రజలు అందించిన ఘన విజయాన్ని బాధ్యతగా తీసుకుని ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చేవిధంగా కృషి చేస్తామన్నారు. జిల్లాలో అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. రోడ్లు, వ్యవసాయం, రెవెన్యూ, గృహనిర్మాణం, విద్యుత్ తదితర ప్రధాన అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, మద్దిపాటి వెంకట్రాజు, జేసీ బి.లావణ్యవేణి తదితరులు పాల్గొన్నారు. మంత్రి కొలుసు పార్థసారధిని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు శాలువాతో సత్కరించారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు

జంగారెడ్డిగూడెం, జూలై 15: పట్టణంలో పలు దుకాణాలలో తూనికలు, కొలతల అధికారులు సోమవారం దాడులు చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో కూల్ డ్రింక్స్ అధిక ధరలకు అమ్ముతున్న దుకాణంపై కేసు నమోదు చేశారు. అనంతరం గ్రోమోర్ ఎరువుల దుకాణంలో పొటాషియం ధరల తేడా గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో ఒక ఎరువుల దుకాణం, ఒక కిరాణా దుకాణంపై దాడి చేసి కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

కుక్కునూరు, జూలై 15: పురుగు మందుల దుకాణాల్లో సోమవారం ఏవో బాలాజీ తనిఖీ నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాల రికార్డులను పరిశీలించారు. వాటి శాంపిల్స్‌ను తీసుకుని పరిశోధన కేంద్రాలకు పంపినట్లు ఏఓ తెలిపారు. పంపినవాటిలో నకిలి ఉన్నట్లు తేలితే కేసు నమోదు చేస్తామన్నారు. బిల్లు బుక్‌లు, ఓఫామ్‌లు, గొడౌన్ రిజిస్టర్లు, డిజిటల్ స్టాక్, ఇన్వాయిస్‌లు కూడా తనిఖీ చేశారు.

కేఎల్ రావు ఆశయాలకు పునరంకితం అవుదాం

ఏలూరు టూటౌన్, జూలై 15: ప్రముఖ ఇంజనీర్ పద్మభూషణ్ కేఎల్.రావు ఆశయాలకు ఇంజనీర్లంతా పునరంకితం కావాలని ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఇరిగేషన్ కార్యాలయంలో కేఎల్.రావు జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇరిగేషన్ ఎస్ఈ.దేవప్రకాశ్ మాట్లాడుతూ దేశంలో ఎన్నో ప్రసిద్ధి గాంచిన కట్టడాలతో దేశాభివృద్ధికి తోడ్పాటునందించిన కేఎల్.రావు ఇంజనీర్లకు స్ఫూర్తి అన్నారు. కేఎల్.రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు అర్జున్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, తదిరులు పాల్గొన్నారు.

అరుణాచలం క్షేత్రానికి ఆర్టీసీ సర్వీసు

ఉంగుటూరు, జూలై 15: భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈనెల 19న రాత్రి 7గంటలకు తాడేపల్లిగూడెం డిపో నుంచి అరుణాచలం బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. 20న శ్రీకాళహస్తి, కాణిపాకం దర్శనం, అదే రోజు రాత్రి శ్రీపురం శ్రీ మహాలక్ష్మి దర్శనం చేసుకోవచ్చన్నారు. 21న ఉదయం గురు పౌర్ణమి తెల్లవారుజామున రెండు గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. గిరిప్రదక్షిణం, స్వామి వారి దర్శనం అనంతరం తిరిగి బయలు దేరి తాడేపల్లిగూడెం వస్తుందని డిపో మేనేజర్ వివరించారు. చార్జి రూ.2600 నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని, 99592 25488, 99597 53102, 99855 44411 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే చింతమనేని



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, జూలై 15: అర్హులందరికీ పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెరుగుగూడెంలో మాజీ సర్పంచ్ యలమర్తి హేమ శ్రీనివాస్, పావులూరి దశరథరామయ్య అధికారుల ఆధ్వర్యంలో మీకోసం మీ చింతమనేని పేరిట సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం కొంతమంది అనర్హులకు పింఛన్లు, అక్రమంగా కొన్ని పథకాలను కట్టబెట్టిందని, వాటిపై విచారణ చేసి అర్హులకు అందించాలన్నారు. తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీవో శ్రీలత, పంచాయతీ, వ్యవసాయ, ఉపాధి హామీ, ఉద్యానవన, స్త్రీశిశు సంక్షేమ, వెలుగు, నీరు చెట్టు, విద్యుత్ తదితర శాఖ అధికారులతో వివిధ సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, నాగనబోయిన సత్యనారాయణ, మోతుకూరి నాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం చల్లచింతలపూడి కొత్త కమ్మవారిగూడెంలో టీడీపీ శ్రేణులతో కలసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికులు అంగన్వాడీ కేంద్రం సమస్యను ఎమ్మెల్యే చింతమనేని దృష్టికి తీసుకువెళ్లారు. చింతమనేని గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

ముంపు చేలను పరిశీలించిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: నాచుగుంట-వెల్లమిల్లి రేవు సమీపంలో నీట మునిగిన వరి చేలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోమవారం పరిశీలించారు. ఏటా వర్షాలకు సుమారు 450 ఎకరాల పంట నష్టం వాటిల్లుతుందని, శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, బండి స్వరూప్, పంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గోతులు పూడ్చిన తర్వాత వంతెనపై వాహన రాకపోకలు

బైనేరు వంతెనపై గోతులు పూడ్చారు

కొయ్యలగూడెం, జూలై 15: బైనేరు వంతెనపై ప్రమాదభరితంగా ఉన్న గోతులు పూడ్చారు. 'డేంజర్' శీర్షికన వాహన చోదకుల ఇబ్బందులపై సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. తాత్కాలికంగా గోతులను పూడ్చడంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ జామ్ ఇబ్బంది లేకుండా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. సమస్య పరిష్కారం కావడంతో వాహనచోదకులు, స్థానిక ప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో ఎస్పీ శివ కిశోర్ దంపతులు



ఎస్పీ దంపతులకు స్వామివారి చిత్రపటం

ద్వారకా తిరుమల, జూలై 15: చిన్న వెంకన్న ఆలయాన్ని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ దంపతులు సోమవారం సందర్శించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడానికి ముందే స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ఆలయ తూర్పుగోపురం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. బంగారు వాకిలి గుండా లోనికి ప్రవేశించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో ఆయనకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. డిప్యూటీ ఈవో బాబూరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వాగు రహదారిపై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



జల్లేరు వాగు వద్ద నిలిచిన ఆర్టీసీ బస్సు

జంగారెడ్డిగూడెం, జూలై 15: పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద జల్లేరు వాగుపై తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రహదారిపై ఆర్టీసీ బస్సు సోమవారం నిలిచిపోయింది. జంగారెడ్డిగూడెం డిపో బస్సు బుట్టాయగూడెం మీదుగా రెడ్డిగణపవరం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో బుట్టాయగూడెం మీదుగా రాకుండా పట్టెన్నపాలెం వైపు వచ్చారు. బ్రిడ్జి ప్రక్కనే తాత్కాలికంగా వేసిన రహదారి ఎత్తుగా ఉండడం, రహదారిపై బురదలో బస్సు పైకి ఎక్కలేక నిలిచిపోయిందని ఆర్టీసీ డిఎం గంగాధరరావు తెలిపారు. టిప్పర్ లారీ సాయంతో బస్సును తాళ్ళతో కట్టి వెనక్కి లాగామన్నారు. కండక్టర్, ప్రైవేటు డ్రైవరు ఇద్దరూ ఆ రూటులో కొత్త కావడంతో సర్వీసు నిలిపివేసిన రోడ్డుకు బస్సును తీసుకువెళ్లారని తెలిపారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటుందని, బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దర్గా అభివృద్ధికి సహకరించండి

ఏలూరు రూరల్, జూలై 15: శనివారపేపేటలో ఉన్న హజరత్ సయ్యద్ జమాల్షావలీ దర్గా వారసులు, ముతావల్లీ, మహ్మద్ షరీఫ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బడేటి చంటిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 30న ఉరుసు ఉత్సవానికి ఆహ్వానించారు. ఈ క్రమంలో దర్గా పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయి, మరుగుదొడ్లు లేక భక్తులకు అసౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి దర్గా అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ముజావర్ ఎండీ అన్వర్ షరీఫ్, అమీర్‌జాన్, ఎస్.కె జాఫర్ షరీఫ్, జమాల్ షరీఫ్, అజీద్‌బేగ్, ఆరీఫ్ బేగ్, ఎస్.కె ఫట్టర్, ఖాదర్‌వలీ, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సాయం



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ద్వారకా తిరుమల, జూలై 15: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. దేవస్థానం హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెస్సార్ ట్రస్టు తరపున మొగతడకల శ్రీనివాసరావు, లక్ష్మీరమణి రూ.50 వేలు విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల ఆవరణను టీడీపీ నేత ఓం ప్రకాష్‌చౌదరి కూలీలను పెట్టి శుభ్రం చేయించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు సోమవారం ముగిశాయి. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, బిళ్వార్చనలు నిర్వహించారు. ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- పోస్టల్ కాలనీ శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నాగదేవత ఆలయం వద్ద ఈనెల 30న కావడి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఈవో కలగర శ్రీనివాస్, అర్చకులు ఉప్పులూరి రవికుమార్‌శర్మ, ఉండి సాయి సుధీర్‌కుమార్ తెలిపారు.
- కొత్తపేట నూకాలమ్మ ఆలయ హుండీని సోమవారం అధికారులు లెక్కించగా 90 రోజులకు రూ. 89,923 ఆదాయం లభించినట్టు ఈవో మీసాల వెంకట్రావు తెలిపారు. నాగం సన్యాసిరావు, భక్తులు ఉన్నారు.
- **ఏలూరు టూటౌన్ :** దళిత హక్కుల పోరాట సమితి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జయరాజు జయంతి కార్యక్రమం ఆర్ఆర్.పేటలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు ప్రతాప్‌కుమార్, బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం మాట్లాడారు. వృద్ధ మహిళలకు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు.
- **చింతలపూడి :** పట్టణంలోని గాజులవారి వీధిలో వర్షానికి ఇంటి గోడలు కూలిపోవడంతో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పుల్లమ్మ, సాయివెంకట్ కుటుంబాలకు ఒక్కొక్కరికి 25కేజీల బియ్యాన్ని వీఆర్వో బాబు అందజేశారు. పక్కాల వెంకటేశ్వరరావు, కొత్తపూడి శేషగిరి, తాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- చింతలపూడి జడ్పీ పాఠశాలలో 3 నుండి 9వ తరగతి వరకు ప్రతిభ చూపిన విద్యార్థులకు సింగవరపు సంజీవరావు దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.15వేలు హెచ్ఎం చక్రధర్‌రావుకు అందజేశారు.
- చింతలపూడి పట్టణంలోని నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి సి.మధుబాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు బి.నాగేశ్వరరావు, పట్నాల శ్రీనివాస్, ఎమ్డీ అక్బర్‌ఆలీ పాల్గొన్నారు.



జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జగన్నాథ రథయాత్ర



రథంలో ఊరేగుతున్న స్వామివారు

నూజివీడు, జూలై 15: జగన్నాథ భక్తబృందం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను నూజివీడులో వైభవోపేతంగా నిర్వహించారు. నూజివీడు పట్టణంలోని రాజీవ్ సర్కిల్ నుంచి డీఏఆర్ కళాశాల వరకు ఈ రథయాత్ర నిర్వహించగా, భక్తులు రథాన్ని లాగేందుకు ఆసక్తి కనబరిచారు. హరేకృష్ణ సంకీర్తనలతో కోలాట నృత్యాల నడుమ రథయాత్ర సాగింది. రాత్రి 7 గంటలకు జగన్నాథుడికి 108 రకాల నైవేద్యాలతో మహాప్రసాద నివేదన, హారతులను వేదపండితులు అందించారు. అనంతరం అన్నదానం జరిగింది.

డ్రెయినేజీ వివాదంపై సర్వేకు నోటీసులు జారీ



డ్రెయినేజీ సమస్యపై మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

ముసునూరు, జూలై 15: రమణక్కపేటలో నీట మునిగిన ఇళ్ళు శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురిత మైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, సర్వేయర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ కుమ్మరివారి బజారులో డ్రైనేజీ ఆక్రమణతో నీట మునిగిన నివాస గృహాలను పరిశీలించారు. అలాగే డ్రెయినేజీపై పోసిన మట్టి, ఫెన్సింగ్‌ను పరిశీలించారు. రెండేళ్లుగా వర్షం పడితే నీరువెళ్ళే దారిలేక గృహాలు ముంపునకు గురవుతున్నాయని బాధిత కుటుంబాలవారు అధికారులకు వివరించారు. డ్రైనేజీకి అడ్డుగా ఉన్న మట్టిని తొలగించాలని ఆక్రమణదారుడికి అధికారులు సూచించగా తన భూమి ఉన్నంతవరకు మట్టిని గట్టుగా పోసుకున్నానని, మట్టిని, ఫెన్సింగ్‌ను తొలిగించనని, సర్వే చేసి ప్రభుత్వ భూమి ఉంటే డ్రైనేజీ ఏర్పాటు చేసుకోవాలని ఆక్రమణదారుడు అధికారులకు చెప్పడంతో పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు ఆక్రమణదారుడికి సర్వే నిమిత్తం నోటీసులు జారీ చేసినట్లు, త్వరలో సర్వే చేస్తామని ఈవోపీఆర్డీ తెలిపారు.



కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రమిస్తున్న బలే చిరంజీవి

సంచార జాతులకు డీఎన్‌టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

కైకలూరు జూలై 15 : బీసీల జాబితాలో సంచార జాతులకు బీసీ డీఎన్‌టీ సర్టిఫికెట్‌ను తక్షణమే ఇవ్వాలని ఏలూరు జిల్లా అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండల అధ్యక్షుడు బలే చిరంజీవి కోరారు. సోమవారం ఏలూరులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కేంద్ర సామాజిక న్యాయశాఖ దేశవ్యాప్తంగా ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి బీసీల్లో ఉన్న సంచార జాతులకు డీఎన్టీ (డి నోటిఫైడ్ సంచార తెగలు) సర్టిఫికెట్‌ను ఇవ్వాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులతో ఇకపై డీఎన్‌టీ సర్టిఫికెట్లను ఇప్పించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సైదు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గుమ్మా రాము తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



ముదినేపల్లి, జూలై 15 : ముదినేపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం సోమవారం ప్రారంభమైంది. రూ.30 లక్షలతో నిర్మించనున్న ఈ రహదారిని సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఉప సర్పంచ్ ఈడే సుధాకర్ ప్రారంభించారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ఈ రహదారిని 21 అడుగుల వెడల్పున నిర్మిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయి కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రాత్రి బైక్ పార్కింగ్.. తెల్లారేసరికి మాయం

ఆగిరిపల్లి, జూలై 15: ఆగిరిపల్లి మండలం సగ్గూరు గ్రామానికి చెందిన తుండూరు శ్రీమన్నారాయణ ఈ నెల 8వ తేదీ రాత్రి తన ఇంటివద్ద బైక్‌ను పార్క్ చేశాడు. తెల్లవారేసరికి అది కనిపించకపోవడంతో ఈ నెల 14న ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలపై దాడులు

ఆగిరిపల్లి, జూలై 15: చిన్నాగిరిపల్లిలో ఆదివారం కోడి పందేలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2100 నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అప్పు పుట్టడం లేదు!



చిన్నంపేట పంచాయతీ కార్యాలయం

- మూడేళ్లుగా సాధారణ నిధులు రాక అప్పుచేసి పనులు
- పారిశుధ్య పనులకు సొమ్ములేవంటున్న సర్పంచ్‌లు
- ప్రజలకు ముఖం చూపలేకపోతున్నామని ఆవేదన

వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు మూడేళ్లుగా కనీసం సాధారణ నిధులు కూడా ఇవ్వకుండా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, పనులు చేయటానికి అప్పు కూడా పుట్టక ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాట్రాయి, జూలై 15: గతంలో జనరల్ ఫండ్ ఏడాదికి పెద్ద పంచాయతీలకు రూ. 4 నుంచి 5 లక్షలు, చిన్న పంచాయతీలకు 2 నుంచి 3 లక్షలు వచ్చేదని వాటితో సిబ్బంది జీతాలు, తాగునీటి పథకాలు, వీధిలైట్ల మెయింటెనెన్స్ చేసేవారమని, ఇప్పుడు తాగునీటి పథకాలు, వీధిలైట్లు నిర్వహణకు సొమ్ములేక అప్పు పుట్టక తాము ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. సకాలంలో పనులు చెయ్యకపోవటంతో జనంలో చులకనయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు ద్వారా వచ్చే ఆదాయంలో 12 శాతం జనరల్ ఫండ్ పేరుతో పంచాయతీ ఖాతాలకు జమ చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దాన్ని 6 శాతానికి తగ్గించి మూడేళ్ళ నుంచీ మొండి చెయ్యి చూపటంతో సర్పంచ్‌ల పరిస్థితి దయనీయంగా మారింది. చాట్రాయి మండలంలో 18 గ్రామ పంచాయతీల నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు పలు ధఫాలుగా కరెంట్ బిల్లులు పేరుతో ప్రభుత్వం తమకు చెప్పకుండా రూ. 3 కోట్లు వరకు లాగేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన గ్రాంట్లు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులు కూడా కొట్టేయటం అన్యాయమని సర్పంచ్‌లు వాపోతున్నారు. ఇప్పటికే తమ స్థాయిని మించి అప్పులు చేశామని కొత్త అప్పులు ఇచ్చే నాథుడు లేడని, పనులు చెయ్యలేకపోవటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మానసికంగా కుంగిపోతున్నామని సర్పంచ్‌లు అంటున్నారు. ప్రభుత్వం సాధారణ నిధుల బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని వేడుకొంటున్నారు.

మానసికంగా నలిగిపోతున్నాం



పంచాయతీకి నిధులు లేకపోవటంతో పనులు చేయలేక అవస్థలు పడుతున్నాం. వర్షాకాలం రావటంతో పారిశుధ్య పనులకు చేతిలో చిల్లిగవ్వ లేదు. తాగునీటి పథకాలు, వీధిలైట్లు నిర్వహణ భారంగా మారింది. ప్రజల కనీస సమస్యలు తీర్చలేక మానసికంగా నలిగిపోతున్నాం. ప్రభుత్వం పంచాయతీల దుస్థితిని అర్థం చేసుకొని జనరల్ ఫండ్ బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలి.

\- పరసా ధనలక్ష్మి, సర్పంచ్, చిన్నంపేట

తమ్మిలేరుకు జలకళ



తమ్మిలేరు ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీరు

తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు తమ్మిలేరు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 555 క్యూసెక్కులు ఉండగా సోమవారం తమ్మిలేరు బేసిన్‌లో 335 అడుగులు, గోనెలవాగులో 333 అడుగులకు నీటి మట్టం చేరినట్లు ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు. ప్రాజెక్టు కింద ఏలూరు జిల్లాలో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండటంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

\-చాట్రాయి

వైసీపీ పాలనపై విచారణ జరపాలి : ముద్దరబోయిన



నూజివీడు, జూలై 15: గత వైసీపీ పాలనపై సమగ్ర విచారణ జరపాలని, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. సోమ వారం నూజివీడులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇసుక, మద్యం విక్రయాల్లో గత ప్రభుత్వం పారదర్శకత పాటించ లేదని, నిబంధనలు తుంగలో తొక్కి మాజీ సీఎం జగన్ ప్రజల క్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోకుండా తన స్వలాభం చూసుకున్నారన్నారు. జగనన్న కాలనీలపైన, మద్యంపైన, సమగ్ర విచారణ జరిగితే దేశంలోనే అతిపెద్ద కుంభకోణం బయటపడుతుందన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రం ఏ విధంగా నష్టపోయిందో రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రాలను విడుదల చేస్తూ ప్రజలకు వివరిస్తున్నారన్నారు. ఈ శ్వేతపత్రాల విషయం మింగుడుపడని వైసీపీ నాయకులు వాటిని పక్కదారి పట్టించటానికి తప్పుడు ప్రచారాలు ప్రారంభించారన్నారు.

ఏడు అర్జీల స్వీకారం

నూజివీడు టౌన్, జూలై 15: సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమంలో భాగంగా అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరి అధికారులకు సూచించారు. సోమవారం వివిధ సమస్యలపై మొత్తం ఏడు అర్జీలు దాఖలైనట్లు, ప్రధానంగా భూ ఆక్రమణపై రెండు అర్జీలు, టీసీలు ఇవ్వని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై ఒక ఫిర్యాదు దాఖలైనట్లు ఆమె తెలిపారు.

ఫిష్ ఆంధ్రా భవనాన్ని స్వాధీనం చేసుకోవాలి

నూజివీడు టౌన్, జూలై 15: వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఫిష్ ఆంధ్రా భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని, టీడీపీ తుక్కులూరు గ్రామ నాయకులు అన్నే సురేష్, ఎంపీడీవో కిరణ్‌కుమార్‌ను కోరారు. సోమవారం గ్రామంలో పర్యటించిన ఆయనకు ఈ భవనంపై ఫిర్యాదు చేశారు. భవనాన్ని పంచాయతీకి స్వాధీనం చేయాలన్నారు. అలాగే పలు సమస్యలను గ్రామస్థులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు.

18 నుంచి జనసేన సభ్యత్వాల నమోదు

నూజివీడు టౌన్, జూలై 15: జనసేన సభ్యత్వాల నమోదులో నూజివీడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా జనసైనికులు కృషి చేయాలని, నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు అన్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఈ నెల 18 నుంచి 28 వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించటం జరుగుతోందన్నారు. ప్రతి మండలంలోని గ్రామాల్లో క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. క్రియాశీల సభ్యులకు రూ.5 లక్షల జీవిత బీమాతో పాటు రూ. 50 వేలు ప్రమాద బీమా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

20న మండల సర్వసభ్య సమావేశం

ముసునూరు, జూలై 15: ముసునూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.



సచివాలయంలో చిత్రపటాల ఆవిష్కరణ

ముసునూరు, జూలై 15: వలసపల్లి గ్రామ సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చిత్రపటాలను సోమవారం సర్పంచ్, టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ చలసాని దామోదరరావు, సచివాలయ కార్యదర్శి పామర్తి వీర్రాజు సమకూర్చిన ఈ చిత్రపటాలను టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర, సర్పంచ్, నాయకులు నెరుసు సత్యనారాయణ, ఎస్.నాగరాజు, ఏ.రామరాజు, ఎం.మురళీకృష్ణ ఆవిష్కరించి, సచివాలయంలో ఏర్పాటు చేశారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

చాట్రాయి, జూలై 15: చీపురుగూడెంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ముందు జాగ్రత్తలు పాటిస్తే డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర రోగాల బారిన పడకుండా ఉండవచ్చునని అన్నారు. ప్రతి ఒక్కరు కాచిచల్లార్చిన నీరు తాగాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జ్వరం లక్షణాలు కన్పిస్తే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స పొందాలని కోరారు. సీహెచ్‌వో రమణ, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభాకర్, జానకి, ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు హక్కు పత్రంపై అవగాహన



చాట్రాయి, జూలై 15:మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెం గ్రామాల్లో సోమవారం కౌలురైతు గుర్తింపు కార్డులపై భూ యజమానులు, కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మక్సూద్ అలీ, ఏవో శివశంకర్ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు పొందితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్ముకోవచ్చునని, ఇంకా ఇ-క్రాప్ నమోదు, బీమా, పంట నష్టపరిహారం, బ్యాంకు రుణం పొందవచ్చునని అన్నారు. పలువురు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, నోబుల్‌రెడ్డి, కందుల కృష్ణ, తల్లాడ శ్రీను, నక్కా రాము, ములగలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రతి కౌలు రైతు పంట సాగు హక్కు పత్రాన్ని పొంది, ప్రభుత్వం అందించే వివిధ పథకాల లబ్ధిని పొందాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్ అన్నారు. సోమవారం రమణక్కపేట సచివాలయంలో కౌలు రైతు గుర్తింపు కార్డుల అవగాహన సదస్సు ఏవో ఎస్.మధుమోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు పొందడం వల్ల ప్రభుత్వం అందించే పంట రుణాలు, అన్నదాతా సుఖీభవ, వడ్డీ లేని రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం, పంటల బీమాతోపాటు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు పొందవచ్చన్నారు. ఏవో మధుమోహన్ మాట్లాడుతూ భూ యాజమాని పట్టాదారు పాసుపుస్తకం నకలు, ఆధార్ కార్డు నకలు, అంగీకార పత్రం, ఫోన్ నంబరుతోపాటు కౌలు రైతు ఆధార్ కార్డు నకలు, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి సీసీఆర్‌సీ కార్డులను పొందాలన్నారు. ఏఈవో రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్, వీహెచ్ఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం : కామినేని



కోరుకొల్లు లాకుల వద్ద నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, జూలై 15: గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోరుకొల్లు లాకుల నుంచి సీబీ కెనాల్‌కు నీరు విడుదల చేశారు. తొలుత జలహారతి ఇచ్చారు. అనంతరం జరిగిన సభలో కామినేని మాట్లాడుతూ తాగునీటి వంతును చేపల చెరువులకు మళ్లిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి స్వచ్ఛనీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధి లేక అధ్వానంగా మారాయన్నారు. చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ఆక్వా మేతల ధర నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. కొండంగి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి సమస్య పరిష్కరిస్తామని, ఉప్పుటేరులోకి తీపి నీరు రాగానే ఎత్తిపోతలను ప్రారంభిస్తామన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, మాజీ ఎంపీపీలు వలవల రామారావు, తులసీరావు, మాజీ సర్పంచ్ మంతెన సుబ్బరాజు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈఈ విశ్వకుమార్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం బొబ్బిలిగూడెంలో ఉపాధి పథకం ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సీబీ కెనాల్ వెంబడి కొబ్బరి మొక్కలు నాటిన తర్వాత వాటికి రక్షణ వలయం ఏర్పాటు చేసి నీరు పోసి సంరక్షించాలన్నారు.

చేతివృత్తుల వారి సంక్షేమానికి కృషి

కైకలూరు జూలై 15: చేతివృత్తుల వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీకామాక్షి పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో కామినేనికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం చేతివృత్తుల వారికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయగా వైసీపీ వారి సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చేతివృత్తుల వారికి రాయితీలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు అనుపోజు నాగేశ్వరరావు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ టేకి వెంకట సత్యనారాయణ, స్వర్ణకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వేమవరప్పాడులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు బోడావుల సాయి దుర్గాప్రసాద్, చావలి దుర్గాప్రసాద్ కుటుంబాలను కామినేని పరామర్శించారు. అన్నిరకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రతికూలత ఎదుర్కొంటేనే విజయం: డీఎస్పీ



నూజివీడు టౌన్, జూలై 15: ప్రతికూలతను ఎదుర్కొంటేనే ఏ విజయమైనా సాకారం అవుతుందని, నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. సోమవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులతో మన చేతల్లోనే మన భవితవ్యం అనే అంశంపై ప్రేరణాత్మక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని పెంచుకుంటూ ప్రపంచంలోని సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలన్నారు. ఏ విజయం అయినా ప్రతికూలతలను ఎదుర్కొంటేనే సాధ్యమవుతుందన్నారు. అయితే ఆ ప్రతికూలతలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశం మన చేతలపైనే ఆధారపడి ఉందన్నారు. ట్రిపుల్ ఐటీ పీయూసీ ఇన్‌ఛార్జ్ దుర్గాబాబు, అసోసియేట్ డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ జ్యోతిర్లాల్ నాయక్ డీఎస్పీని ఘనంగా సత్కరించారు.

టీబీపై అవగాహన ఉండాలి



కలిదిండి, జూలై 15 : టీబీపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులు ధీరజ్ కుమార్, హేమంత్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడుతూ దగ్గు, జ్వరం వారం రోజులు తర్వాత కూడా ఉంటే టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల్లో టిబి ఉంటే తీవ్రతను బట్టి చికిత్స ఉంటుందన్నారు. వైద్యాధికారిణి జాహ్నవి, ఎస్‌టీఎస్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కలిదిండి, జూలై 15 : కలిదిండిలో సోమవారం పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండటంతో ఎక్స్‌కవేటర్‌తో డ్రైనేజీల్లో పూడికను తొలగిస్తున్నారు. రోడ్లపై, సంత మార్కెట్‌లలో ఉన్న చెత్తాచెదారం తొలగిస్తున్నారు. డ్రైనేజీల వెంబడి బ్లీచింగ్ చల్లుతున్నారు. సర్పంచ్ ఎం.మారుతీ ప్రసన్న, కార్యదర్శి ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ముదినేపల్లి ఐటీఐ కళాశాలలో నమూనాల ప్రదర్శన

ఐటీఐలో యూత్ స్కిల్ డే

ముదినేపల్లి, జూలై 15 : యువజన నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ముదినేపల్లిలోని ఎస్‌పీఏఎం ఐటీఐ కళాశాలలో విద్యార్థులు తాము తయారుచేసిన నమూనాలను ప్రదర్శించారు. ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన విద్యార్థులు రూపొందించిన హైడ్రో పవర్ స్టేషన్, ఫిట్టర్ విభాగ విద్యార్థులు రూపొందించిన నూతన త్రెడ్డింగ్, టాపింగ్ పరికరాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫిరంగి డెమో నిర్వహించారు. ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.హరిత, ఇన్‌స్ట్రక్టర్లు మణి భీమరాజు, బోయిన కృష్ణమోహన్, శివ తదితరుల ఆధ్వర్యంలో విద్యార్థులు పరికరాలను ప్రదర్శించారు. ఉడ్, ఐరన్‌తో కలసి తయారు చేసిన తాజ్ మహల్ మరింత ఆకట్టుకుంది.

ఇన్‌కం ట్యాక్స్ ఫైలింగ్‌పై అవగాహన



ఆగిరిపల్లి, జూలై 15: ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ ఈ ఫైలింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని డీపీఆర్‌టీయూ ఆగిరిపల్లి మండల శాఖ ప్రారంభించింది. ఈ ఫైలింగ్‌పై వివరించడం అభినందించదగ్గ విషయమని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల్లోని ఉపాధ్యాయులంతా వినియోగించుకోవాలని మండల గౌరవ అధ్యక్షురాలు బీవీఎస్ లక్ష్మి అన్నారు. డీపీఆర్‌టీయూ ఆగిరిపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీబీఎం సుహాసిని, వంశీ వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోళ్ళవ్యర్థాల తరలింపు

ఆగిరిపల్లి, జూలై 15: కోళ్ల వ్యర్థాలపై నిషేధం ఉన్నప్పటికీ ఆగిరిపల్లి మండలంలో కోళ్ళవ్యర్థాల రవాణా సాగుతోంది. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల చేపలచెరువులకు ఈ వ్యర్థాల రవాణా సాగుతోందని తెలుస్తోంది. ఈ కోళ్ళవ్యర్థాల వల్ల చేపలకు, వాటిద్వారా మనుషులకు రోగాలు రావడం వంటి తీవ్ర పరిణామాలు ఉంటాయని తెలిసినప్పటికి అధికారుల అలసత్వం వల్ల వీటి నివారణ యథేచ్ఛగా సాగుతోంది.

రహదారులు ఛిద్రం

నరకం చూస్తున్న ప్రజలు



చీపురుగూడెంలో బురదకయ్యగా ప్రధాన రహదారి



రామానగరంలో డ్రెయినేజీ లేక రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు



ముదినేపల్లి జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

చాట్రాయి, జూలై 15: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లో రహదారులు బురదకయ్యలుగా మారి ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. కొన్నేళ్లుగా రహదారులకు మరమ్మతులు లేకపోవటంతో గోతులతో అధ్వానంగా తయారయ్యాయి. ఈ వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనాల తాకిడికి రహదారులు ఛిద్రమై కనీసం నడవటానికి కూడా అవకాశం లేకుండా మారాయి. బురద రోడ్లపైన విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళలేక ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల అపరిశుభ్రత వల్ల అంటువ్యాధుల ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణం ఉన్నతాధికారులు రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ లేక..

నూజివీడు టౌన్: వర్షాలతో నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లోని శివారు ప్రాంతాలు పారిశుధ్య లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నూజివీడు మండలం మిట్టగూడెం శివారు లీలానగర్‌లో గల రామానగరంలో డ్రెయినేజి వ్యవస్థ లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపైనే మురుగునీరు ప్రవహిస్తుండటంతో దోమలు విజృంభించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణం పారి శుధ్యం మెరుగుకు చర్యలకు చేపట్టడంతో పాటు కనీసం కచ్చా డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రహదారులపై నిలిచిన వాననీరు

ముదినేపల్లి: వర్షాలకు ముదినేపల్లి బురద కయ్యలా మారింది. ప్రధాన రహదారితోపాటు గ్రామంలోని అంతర్గత రహదారులు కూడా జలమయమై వాహనాల రాక పోకలకు ప్రమాదకరంగా మారాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన డ్రైన్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవటంతో డ్రైనేజీ సౌకర్యం కొరవడింది. ఆర్టీసీ బస్ స్టేషన్, పోలీస్ స్టేషన్, ఎస్‌బీఐల వద్ద నీరు నిలబడి ఇబ్బందికరంగా ఉంది. శ్మశాన వాటికకు వెళ్లే రహదారిపై బురద పేరుకు పోయింది. ముదినేపల్లి - గుడ్లవల్లేరు రోడ్డులో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు, వర్షపు నీరు కలవటంతో మురుగు పెరిగి దోమల బెడద ఎక్కువైందని, రోడ్లపై నిల్వ ఉండే నీటిని బయటికి పంపేందుకు తాత్కాలిక డ్రైన్లను తవ్వించాలని పలువురు కోరారు.